ఈనాడు ఆదివారం - 12, మే, 1996

# మధ్యవర్తి

ముప్ఫై ఏళ్ళు గవర్నమెంటు సర్వీసు చేసి నేను ఆవేళ రిటైరు కాబోతున్నాను. అందుకే ఆ సాయంకాలం మా సెక్షన్ వాళ్లు నాకు ఘనంగా వీడ్కోలు చెప్పాలని మా ఆఫీసు ప్రాంగణంలో చిన్న సైజు సభలాంటిది ఏర్పాటు చేసి, పొగడ్తలతో నిండిన ఓ సన్మాన పత్రం, జ్ఞాపికలు ఇచ్చారు. కాశ్మీరు శాలువాకు దీటుగా వుండే చేనేత శాలువా కప్పారు. నారాయణగారూ, వీరయ్యా తదితర మిత్రులు వక్తలై నన్నూ నా పనితనాన్ని పొగిడారు. మౌనంగా కుర్చీలో కూర్చున్న నేను ఆ మాటలు వింటూ చాలాసేపు నవ్వు ఆపుకునే ప్రయత్నం చేస్తూ ఓ కొత్త అవస్థలో కొట్టు మిట్టాడాను. ఆపైన కుర్చీలో అటూ ఇటూ కదుల్తూ కాలక్షేపం చేయవలసి వచ్చింది. సన్మాన గ్రహీతగా సమాధానం చెప్పడానికి లేచి కళ్ళజోడు సర్దుకుని నాలుగు మాటలు జవాబుగా చెప్పి అందరికీ కృతజ్ఞతలు అందజేశాను. ఆ నాలుగు మాటలూ చెప్తోన్నప్పుడు నా కంఠంలో చిన్న జీరలాంటిది ప్రవేశించి నన్ను కిందామీదా చేసింది. అవును - అస్తమయ సూర్యబింబం పడమటి దిశలోకి అదృశ్యం అయినట్టు ఆ సాయంకాలపు వేళ - ఆఫీసుకు నాకూ మధ్య సంవత్సరాల సంబంధం విడిపోయింది.

ఆఫీసుతో అనుబంధం ఏమిటని ఎవరైనా అంటే నాదగ్గర సజావయిన సమాధానం లేదు. కానీ ఆఫీసు అంటే ఫైళ్లు, బల్లలు, కుర్చీలు, అల్మైరాలూ కాదు కదా? నా అన్నేళ్ల సర్వీసులో ఎంతోమంది కొలీగ్స్ ముఖపరిచయస్తులు స్థాయిదాటి ఆత్మీయుల కోవలోకి వచ్చారు. పనిచేస్తూ ఆ పనిలోని శ్రమను తట్టుకోలేక, ఆ పనులు కల్పించే సమస్యలకు ఓర్చుకోలేక నాకు అప్పుడప్పుడు మిత్రులతో భేటీ తప్పేది కాదు. అపార్థాలకు కొరతా

వుండేది కాదు. కానీ వెంటనే విధి నిర్వహణ అనే దృష్టి మా అందరి మెడలూ పంచి నెత్తిన నాలుగు మొట్టికాయలు వేసేది. ఆఫీసులో పక్క వాళ్లతో సహజీవన సిద్ధాంతం అనే సూత్రం పాటించకపోతే ఎదురయ్యే ఇబ్బందులు ఎలాంటివో చాలామందికి అనుభవమే. క్రమశిక్షణ పెద్ద తలకాయగా మారి తోటివాళ్ళతో సర్దుకుపోయే తత్వంలోని సున్నితత్వం వల్ల లాభాలెటువంటివో చెప్పేది.

ప్రాణ స్నేమితులు కాబట్టి నారాయణగారూ, వీరయ్యగారూ నన్ను టాక్సీ ఎక్కించి ఇద్దరూ నాకు చెరోపెడా కూర్చున్నారు. సగం దూరం ప్రయాణం అయిన తర్వాత టాక్సీ ఆపించి 'మీతో నాలుగు మాటలు మీటింగ్‌లో మాట్లాడనివి, మా మనసుల్లో మిగిలిపోయి గొంతు దగ్గర ఆగిపోయినవి చెప్పాలనుకుంటున్నాం' అన్నారు. నేను వాళ్లిద్దర్నీ చూసి 'చెప్పండి' అన్నాను.

"పూర్ణచంద్రరావుగారూ, ఈవేళ రిటైరయిన మీకు ఏ సమస్యలూ లేవు, మగపిల్లలు ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అమ్మాయికి పెళ్లి చేశారు. ఇక మీ శేషజీవితాన్ని హాయిగా దొర్లించుకోవడం మీ చేతిలో పని. ఇంతకీ చెప్పేదేమిటంటే ఉద్యోగంలో, ఆఫీసరు హోదా ద్వారా లభించిన దర్పం, కాస్తంత పట్టుదల మొదలయిన వాటికి ఇక్కడే ఇప్పుడే తిలోదకాలు ఇచ్చెయ్యండి. ఈ ఎలిమెంట్స్ ఇంట్లో ప్రవేశిస్తే అటు భార్యా పిల్లలూ ఇటు మీరు కూడా అవస్థ పడవల్సి వస్తుంది...." అన్నాడు వీరయ్య.

"చిన్న విషయమే, మీకు తెల్సిందే చెబుతున్నాను... మనిషి తాలూకు బుద్ధి, ఇంకా ఇంకా ఆలోచనలూ చాలా గమ్మత్తయినవి. పైగా అవి పనిలేని వాళ్లను వేధించడమే నిత్య కృత్యంగా పెట్టుకుంటాయి. అందుకే మన మనసును మన ఆధీనంలో ఉంచుకోవాలి. వీలైతే వేదాంతం వైపు దృష్టిని మళ్లించుకోవాలి. అంత:కరణ గురించీ, ఆత్మ గురించి చెప్పే శాస్త్రమే ఆధ్యాత్మిక వాదం అంటారు శ్రీ అరబిందో..." నారాయణగారు నెమ్మదిగా, చెవికి దగ్గరగా వచ్చి చెప్పారు. నారాయణగారు నాకు బహుమానంగా ఇచ్చిన 'ది సింథిసిస్ ఆఫ్ యోగ', 'లైఫ్ డివైన్' పుస్తకాలు నా చేతిలో ఉన్నాయి.

"మా పెద్దన్నయ్య డిప్యూటీ సెక్రటరీగా పనిచేసి రిటైరయ్యాడు. కొలువులో ఉన్నంత కాలం సెక్రటేరియట్‌ని అదరగొట్టేశాడు. సెక్షన్ మొత్తాన్ని తన చెప్పు చేతుల్లో ఉంచుకునేవాడు. రిటైరయ్యాడు. ఇంట్లో అరడజను జనాభాతో మింగలేక నానా ఇబ్బందులూ పడుతున్నాడు" వీరయ్య అన్నాడు.

"ఏం లేదండీ. రిటైరయిన తర్వాత మనం ఇంట్లో కొత్తగా ఉద్యోగంలో చేరిన గుమాస్తాలా ప్రవర్తించాలి. బాధ్యతలన్నీ కొడుక్కీ కోడళ్ళకీ ఇచ్చేసి పరోక్షంగా భార్యని వాళ్లమీద సూపర్‌వైజర్‌గా నియమించాలి. మనం అలా పైపైన 'కర్మణ్యే...' అంటూ అర్ధనిమీలిత నేత్రాలతో ఆనందంగా బతికెయ్యాలి..." నారాయణగారు నయా వేదాంతం కూడా చెప్పారు.

టాక్సీ మా ఇంటికి దగ్గరగా వెడుతోంది.

❖ ❖ ❖

పదిహేను రోజులు గడిచాయి. రిటైర్‌మెంట్ మూలంగా రావల్సిన బెనిఫిట్స్ అన్నీ చేతికి అందాయి. ఆ డబ్బు ఎక్కడ ఎలా ఎంత కాలానికి దాచాలన్నది అనుకున్నంత చిన్న విషయం కాదనిపించింది. నా భార్య సావిత్రి, కొడుకులు, కూతురు, స్నేహితులు ఎవరికి తోచిన సలహాలు వాళ్లు ఇచ్చారు. మొత్తం మీద డబ్బు అటు క్షేమంగా ఉండేటట్టు, వడ్డీరేటు ఎక్కువ ఇచ్చేచోట డిపాజిట్ చేయడం జరిగింది. దాంతో ఒక పర్వం పూర్తి అయింది. ప్రభుత్వ చాకిరీతో, టెన్షన్‌తో బిగుసుకుపోయిన శరీరం కొంచెం కొంచెం రిలాక్స్ అవుతోంది. నిజమే మరి తెల్లవారడం మొదలు ఇంట్లో నానా కసరత్తులూ చేసి రోజూ ఆఫీసుకు పరిగెత్తడమే అయ్యేది. కుర్చీలో కూర్చుని తలపట్టుకుని పేరుకుపోయిన పని పూర్తి చేస్తూ మధ్య మధ్యలో పనిచేయని గుమాస్తాల కోసం పది నిముషాలు నరసింహావతారం ఎత్తడం, పనిచేయకుండా పని చేస్తోన్నట్టు నటిస్తూ దొంగ ఎత్తులు వేసే వాళ్లకోసం నారద రూపం దాల్చడం.... అదో నిత్యకృత్యంగా ఉండేది.

ప్రస్తుతం నేను ఉదయమే మెలకువ వచ్చినా మంచం మీద పడుకునే రేడియో వినిపించే భక్తిరంజని మొదలు తెలుగు వార్తల వరకూ వింటున్నాను. ఆ పైన కాఫీ తాగి ఇంగ్లీషు పేపరు చదివి రెండింటినీ జీర్ణం చేసుకుంటున్నాను. ఆ తర్వాత స్నానం. కిచెన్‌గార్డెన్‌లో విహారం. అలా ఎన్ని పన్లు కల్పించుకున్నా మా గడియారానికి నా మీద కోపం. ఎంతకీ పది గంటలు కొట్టదు. అవును. సర్వీసులో ఉన్నంతకాలం త్వరగా పరిగెట్టినందుకు అది రోజూ నా చేత చీవాట్లు తింటూనే ఉండేది. అందుకే నాలుగైదు ఏళ్ళుగా చదవడం అలవాటయిన శ్రీ అరబిందో 'పూర్ణయోగం' మీది పుస్తకాలన్నిటినీ దుమ్ము దులిపాను. నారాయణగారికి శ్రీ అరబిందో, మదర్ పుస్తకాలు చదవడం, నిత్యజీవితంలో ప్రతీక్షణం, నిముషం,గంట, రోజును యోగమార్గాన మళ్ళించుకోవడంలో ఉండే ఆనందం ఎంతటిదో తెలుసు.

"ఏమిటోనండి" అనేశాను, ఓ రోజు.

"ఇంతెందుకు – చిన్న రహస్యం చెప్పమంటారా– మనకన్నా చాలా గడుసువాడూ, తెలివైనవాడూ భగవంతుడు. మనకు కావల్సింది, ఉత్తమమైనది మనకన్నా ఆయనకే ఎక్కువ తెలుసుట."

"అయితే ఇంకేం. ఇదే హాయేమో! కళ్ళు మూసుకు నడిచినా భయపడనవసరం లేదు"

"దాన్నే తామసిక వైరాగ్యం అంటారు. వైరాగ్యంలో వివేకానికి కూడా స్థానం ఉంది రావుగారూ" అంటూ నవ్వాడు.

"ఇంటగ్రల్ యోగంలో ముఖ్యమైనవి – ముందు మన మనస్సు ద్వారా మనలోని

చైతన్య పురుషుణ్ణి దైవానికి దగ్గర చేయాలి. తరువాత మన ఆత్మను, విశ్వజగత్తులోని ఆత్మలతో సంధానం చేసుకుంటూ తద్వారా దైవంలో విలీనం కాగలగాలి. అలా ముందుకు వెళ్ళిన తర్వాత ఆత్మలన్నీ దివ్య చైతన్యస్ఫూర్తిని పొందుతూ పరమాత్మకు ప్రతిరూపాలవుతాయిట.

నేను వింటున్నాను.

నారాయణగారు నవ్వేశారు. "అర్థం కావడంలేదు కదూ" అన్నారు లాలనగా.

"అవును" అనేశాను నేను.

'అర్థం అవుతుంది. కంగారుపడకపోతే...సింపుల్‌గా చెప్పాలంటే మనిషి సాధకుడుగా బతకాలి. జీవించాలి. అయితే ఒక షరతు – దైవం మాత్రం, మనిషి చేసే సాధనను కొలమానంగా చేసి వరాలు ఇవ్వడుట. మనిషిలో ఆత్మతాలూకు ఆకాంక్షను బట్టి – దాని పరిశ్రమను బట్టే కానుకలు దొరుకుతాయి"

అలా ఇద్దరం కలిసి చదివింది అర్థం కాక – అర్థమయిన దానిలో ఆవగింజంత మాత్రమే ఆచరణలో పెడుతూ, ఎత్తైన శిఖరం ముందు నిలబడ్డ పసివాళ్ళలా, అడుగులు తడబడుతుంటే – ఆలోచనలు నింగీ నేలకాని అవస్థల పాలవుతుంటే ముందు మనసును తిట్టుకుని – ఆపైన లాలిస్తూ, బుజ్జగిస్తూ 'మాకు సహకరించు' అంటూ ప్రార్థనలు చేస్తూ రోజుల్ని గడుపుతున్నాం.

మరో రెండు నెలలు గడిచాయి. ఇంట్లో కాలక్షేపం కరవే అవుతోంది. చేసే పని వెనుకా ముందూ బద్ధకాన్ని జత చేసినా చాలాకాలం ఖర్చు కావడం కష్టం అనిపిస్తోంది. కానీ నా రోజువారీ కార్యక్రమాలు. మెడిటేషన్, చదివే పుస్తకాలు, స్నేహితులు ఇంటికి వస్తే వాళ్ళతో చేసేచర్చలూ చూసి సావిత్రి మొదట్లో ఏమీ అనలేదుగానీ ఆ తర్వాత, నేను నిద్రపోతూంటే, నిద్రపోతున్నారా? అంటూ లేపడం ఏం చేస్తున్నారంటూ ఆరాలు తీయడం మొదలుపెట్టింది.

ఒక్కొక్కసారి "అస్తమానం ఆ పుస్తకాలు పట్టుకుని కూర్చుంటే ఎలాగండీ, మాట్లాడే వాళ్ళు లేక నాకు ఇంట్లో తోచడం లేదు" అంటూ పరోక్షంగా మాట్లాడ్డం మొదలుపెట్టింది. మరో నెల తర్వాత మాట సందర్భంలో దగ్గరగా వచ్చి కూర్చుని "మీతో పాటు రిటైరయిన వెంకటేశంగారు తిరిగి ఉద్యోగంలో జేరారుట" అంది నేను మాట్లాడలేదు.

"కాలక్షేపమూ అవుతుంది... రాబడీ ఉంటుంది..." అంది తిరిగి.

"నీ మనసులో మాట సూటిగా చెప్పరాదా? నన్నూ ఏ ప్రయివేటు కంపెనలోనయినా ఉద్యోగం చూసుకోమంటావు... అంతేనా?"

"అది కాదండీ..."

"అవునులే రిటైరయిన భర్తని చూస్తే భార్యలకు కినుకుగా ఉంటుందిట."

"కినుక కాదండీ. యధాలాపంగా చెప్పానండీ బాబూ..."

"అవును మీ ఆడవాళ్ళకు రిటైర్‌మెంట్ వుండదు. మొగుళ్ళు యాభై ఎనిమిది సంవత్సరాలు రాగానే ఇంట్లో కాళ్ళు జాపుకుని కూర్చుంటే – మీ ఆడవాళ్ళకు కళ్ళు కుడతాయి. నాకు తెలుసులే" నేను కావాలనే ఆ మాటలు అన్నాను.

"రామ రామ! పెడర్థాలు తీయకండి"

అలా అనేసి సావిత్రి లోపికి వెళ్ళిపోయింది. నేను ఆలోచిస్తున్నాను. ఈ మధ్య మా ఇద్దరికీ చిన్న చిన్న భేదాభిప్రాయాలు వచ్చి చిలికి చిలికి గాలివాన మాదిరి తయారవుతున్నాయని నాకు అర్థమవుతూనే ఉంది. నేను సావిత్రికి దూరంగా జరుగుతున్నానో ఆమె నాకు దూరం అవుతోందో నాకు అర్థం కావడం లేదు.

❖ ❖ ❖

రెండు నెలలు గడిచాయి. ఆ వేళ సీతాపతి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. సీతాపతి నా బావమరిది. అతగాడు ఢిల్లీలో వుంటున్నాడు. అంతవరకూ బాగానే వుంది. కానీ అతగాడు అక్కడ ఇల్లు కట్టడం మొదలుపెట్టాడు. అతనికి సకాలంలో లోను శాంక్షన్ కాలేదుట. ఇంటి పనులు ఆగిపోయాయిట. ఓ పాతికవేలు సర్ధగలిగితే తను గట్టున పడతాననీ లోను రాగానే తీర్చగలుగుతాననీ రాశారు. అదీ ఉత్తరంలో సారాంశం. అదే సావిత్రికి చెప్పాను.

"ఏమిటంటావు?" అన్నాను, సావిత్రి మొహంలోకి చూసి.

"నేనేమీ అనలేదే" అంది.

"మనకు వచ్చిన డబ్బంతా డిపాజిట్స్‌లో పెట్టాం. ఏదో ఎమర్జన్సీలో పనికి వస్తుందని కరెంట్ అకౌంట్‌లో కొద్దిమొత్తం ఉంచాం".

సావిత్రి మాట్లాడలేదు.

"ఇప్పుడు మధ్యలో డబ్బు తీసుకుందుకు వీలుపడదు"

"మీ ఇష్టం..." అని సావిత్రి లోపలికి వెళ్ళిపోయింది. సావిత్రి బాధపడిందని నాకు తెలుస్తూనే ఉంది. భోజనాల సమయంలో, ఆ తర్వాత సావిత్రి నాతో చాలా ముక్తసరిగా మాట్లాడింది. సీతాపతికి అతను నొచ్చుకోకుండా నా అసహాయతను తెలియబరుస్తూ చిన్న ఉత్తరం రాసి పడేశాను. నేను ఆ విషయం మర్చిపోవడానికి ప్రయ్నిస్తుండగానే బెంగుళూరు నుంచి నా తమ్ముడు రాజశేఖరంగాడు ఓ పెద్ద ఉత్తరం రాశారు. రజని పెళ్ళి కుదిరిందనీ, మగపెళ్ళివారు అతి తొందరలో పెళ్ళి చేయమంటున్నారనీ అందువల్ల ముహూర్తం పెట్టడం జరిగిందనీనూ.

ఆ వార్త నాకు ఎంతో ఆనందాన్నే ఇచ్చింది. నా తమ్ముడికి ముగ్గురు ఆడపిల్లలు. ఇద్దరి ఆడపిల్లల పెళ్ళి చేసి అప్పటికే వాడు సగం అయ్యాడు. ఉత్తరం ముగించే ముందు ఆఖర్ని వాడు పిడుగులాంటి విషయం ఒకటి వ్రాశాడు. వాడికి పెళ్ళి ఖర్చుల నిమిత్తం ఓ యాభై వేల రూపాయలు సర్దుబాటు చేయాలిట. ఏడాది తర్వాత రిటైరయిన వెంటనే

అప్పు తీరుస్తాట్ట. నాకు గొంతుకలో పచ్చి వెలక్కాయలు ఒకటికన్నా ఎక్కువే పడ్డట్టయింది. ఏం చెయ్యాలో తోచలేదు. అందుకే సావిత్రిని అడిగాను.

"ఇందులో నేనేం చెప్పగలను?" అంది ముభావంగా.

"నువ్వే చెప్పాలి సలహా."

సావిత్రి నవ్వేసింది.. ఆ పైన "మా తమ్ముడికి మీరు సహాయపడలేదని నేను ఏమీ అనుకోను. మరిదికైనా డబ్బు సర్దండి... పెళ్ళి కదా?" అంది.

"మరిదికైనా' అని సావిత్రి ఉపయోగించిన పదజాలంలో అంతరార్థం నాకు, అర్థమవుతూనే ఉంది.

"నేను వేరే ఉద్దేశంతో సీతాపతికి సహాయపడకుండా వుండలేదు. అదింకా నీ మనసును దొలుస్తోందిలా వుంది."

"బావుంది. అసలు విషయం వదిలి మధ్యన వాడి సంగతి దేనికి?" అంది, కోపంగా సావిత్రి.

"నిజమే చెప్పాననుకుంటున్నాను...." అన్నాను.

"మీరు చెప్పేది ప్రతిదీ నిజం అవదు. ఎప్పుడూ సత్యం ఒకవైపుదే అయివుండదుట. అవతలి వారి వైపు కూడా సత్యం వుండచ్చు."

"ఈమాటలు నీవి కావు. చెప్పు.... ఇవి నేనెక్కడో చదివాను"

మీరామధ్య ముందు గదిలో కూర్చుని ఎవరికో ఈ మాటలు చెప్తుండగా అవి నా చెవిన పడ్డాయి".

నాకు కోపం ఆగింది కాదు. "అంటే మాట్లాడేటప్పుడు ఆలోచించుకుని మాట్లాడమని పరాగ్గా వుండవద్దని హెచ్చరించడం కాబోలు".

"బావుందండీ... అసలు"

"ఏం బావుంది..."

"నాకు తెలియదండీ" సావిత్రి విసుగ్గా నా పక్క నుంచి లేచింది.

"సరిగ్గా చెప్ప రాదా... చాలా రోజుల నుంచి చూస్తున్నాను. నువ్వు అవకాశం ఎలా దొరుకుతుందా నన్నెలా దెప్పి పొడవాలా అని చూస్తున్నావు. పూర్వంలా అదే సర్వీసులోనే ఉన్నప్పుడు... అదే అదే" నాకు మాటలు ఎలా చెప్పాలో తెలియలేదు. ఆవేశం కాదు ఊపిరి సలపనివ్వలేదు.

"రామ రామ"

"నేనొకటి అంటే నువ్వొకటి అంటావ్.. చూస్తున్నాను. నేను ఫిలాసఫీ పుస్తకాలు చదవకూడదు. తెలివిగా ఆలోచించి నిర్ణయాలు చేయకూడదు. కాస్త కునుకు తీయకూడదు. అసలు నీ ఉద్దేశం ఏమిటి?"

సావిత్రి నిమిషం బొమ్మలా నా వైపు చూసి నవ్వేసి – ఆ నవ్వు పొడుగ్గా అవుతుంటే,

పమిట కొంగుతో నోటిని కప్పుతూ ఏవేవో విన్యాసాలు చేసింది. నాకు ఆమె వైపు చూడబుద్ధి కాలేదు. గబగబా లేచి ఉన్న మూడు గదుల్లోకి వెళ్ళి ఓ గదిలోంచి షర్టూ, మరో గదిలోంచి పాంటూ,మూడో చోట నుంచి చెప్పులూ వెదుక్కుని నారాయణగారింటికి వెళ్ళాను. అరగంట తర్వాత నా అవస్థ గురించి చెబితే నారాయణగారు నవ్వారు. "ప్రతిసారీ చెల్లాయి మీద కోపతాపాలు ప్రదర్శించకండి.. ముందు కోపాన్నీ ఆవేశాన్ని మనలో జీరో లెవెల్‌కు తీసుకురాగలగాలి. అప్పుడే మనం ఒకటి రెండు మెట్లు వేదాంత శిఖరం తాలూకువి – ఎక్కగలిగినట్టు లెక్క".

నేను "అవును సుమా?" అన్నాను. అప్పుడు సావిత్రి నాకు నా ఆలోచనల్లో మంచి దానిగా, అమాయకురాలిగా కనిపించసాగింది.

రెండు రోజుల కేంప్ మీద మద్రాసు నుంచి మా చిన్న బావమరిది రాఘవ హఠాత్తుగా వచ్చాడు. దాంతో సావిత్రి మొహంలో కళ వచ్చింది. రాఘవ తన ఉద్యోగం ప్రమోషన్ గురించి చెప్పాడు. మేం అతని యోగక్షేమాలు అడిగాం. కబుర్లలో అన్నాడు రాఘవ.

"మీరు రిటైరయిన తర్వాత ఓ సారి వచ్చి చూద్దామనుకున్నాను. ఊపిరి సలపని పనుల మూలంగా కుదరలేదండీ. ఏం చేస్తున్నారు? కాలక్షేపం ఎలా అవుతోంది?" అంటూ గబగబా ప్రశ్నించాడు.

'ఏదో రోజులు గడుస్తున్నాయి."

"ఇక్కడ మీకు కాలక్షేపం అవడం కష్టమే. ఒకటి రెండు నెలలు వచ్చి మా ఇంట్లో ఉండండి బావా" అన్నాడు.

"ఏమిటోరా తమ్ముడూ! ఆయన ఇంట్లో ఖాళీగా కూర్చోలేకపోతున్నారు. పైగా పూర్వం లేని విసుగు ఒకటి వచ్చి పడింది నా ప్రాణానికి! దాంతో నాకే పనీ తోచదు. ఆయన నా మీద విసుక్కుంటే, నేను ఆయన మీద విసుక్కుంటాను" అంది సావిత్రి.

రాఘున నవ్వేశాడు. "అలా అనుకోకే అక్కయ్యా. కింద వాళ్ళమీద ఆథారిటీ చేయడానికి అలవాటుపడ్డ ప్రాణం ఆయనిది! దాంతో నిన్నూ ఓ సబార్డినేట్ అనుకుటున్నారేమో బావగారు" అన్నాడు.

"అయితే మీ బావను నెలకింత జీతం అని యిమ్మనరా. తిట్లు తినడానికి నాకేం అభ్యంతరం లేదు."

"ఒట్టినే ఎందుకంటానోయ్. మీ అక్క ఒకటి చెబితే ఒకటి చేస్తుంది. ఈ మధ్య పరధ్యానం ఎక్కువయ్యింది."

"ఈయన ఇల్లు పట్టకుండా తిరుగుతార్రా. తెల్లారి లేచి నారాయణ గారింటికి వెళ్ళి అవేవో పుస్తకాలు చదువుతారు. ప్రేమలూ అభిమానాలూ ఈ రక్త సంబంధాలు ఒట్టివి. మనం ఆ ఆశ్రమానికి వెడదాం. ఈ ఆశ్రమానికి వెడదాం అంటారు. ఢిల్లీ నుంచి రామంగాడు కూడా తన కూతుర్ని ఇక్కడికి పంపుతానని రాస్తాడు. ఏవీ తోచడం లేదు"

"పోనీ మా అక్కయ్యని నాతో పంపండి బావగారూ. అదీ ఆడబడుచును తీసుకురండని గొడవ చేస్తోంది."

"వస్తానంటే తీసుకువెళ్ళు నాకేం అభ్యంతరంలేదు"

"సరేరా. కొంతకాలం దూరంగా వుంటే నేగాని నా విలువ ఈయనకు తెలిసిరాదు" సావిత్రి అంటోంది.

"మంచిది వెళ్లిరా, ఎందుకో నా మనసు కూడా ప్రశాంతతను కోరుతోంది." అనేశాను నేను. సావిత్రి నా వైపు ఓ క్షణం పరీక్షగా చూసింది. నేనూ చూశాను. కానీ రాఘవ మాత్రం ఏం మాట్లాడలేదు.

రాత్రి పదిగంటలు దాటింది. రాఘవ హాల్లో పడుకున్నాడు. నేను అతనికి గుడ్‌నైట్ చెప్పి నా పక్క మీద వాలి లైఫ్ డివైన్ చదువుకుంటున్నాను. కాసేపటికి సావిత్రి వచ్చి మంచం మీద పడుకుని, ఓ మూలగా జరిగి గోడమీద ఏదో రాస్తోంది. అమె చేతి గాజుల భాష మాత్రం నా చెవిలో పడుతోంది. రెండు మూడు నిముషాలు ఆగి, సావిత్రి ఏమనుకుందో నా వైపు తిరక్కుండానే "మా రాఘవతో నేను మద్రాసు వెడదామనుకుంటున్నాను" అంది.

"మంచిది. కానీ నళిని పిల్లలు మాటేమిటీ? వాళ్ళను పగలంతా ఎవరు చూస్తారు?"

"దాని పిల్లల సంగతి అది చూసుకోగలదు. మీ విషయం చెప్పండి"

"నాదేం వుంది? నాకు వంట వచ్చు. లేకపోతే హోటల్లో తింటాను" అన్నాను సాదాగా.

"అయితే నన్ను వాడితో వెళ్ళమంటోన్నట్టే కదా?" సావిత్రి తిరిగి నన్ను ప్రశ్నించింది.

"అది నీ ఇష్టం. మీ పుట్టింటికి వెళ్ళొద్దని నేను ఏనాడైనా అన్నానా?" కాసేపు మళ్ళీ మా మధ్య నిశ్శబ్దం. నేను సావిత్రి వైపు తిరగలేదు. ఇటు తిరిగాను. "అలాగే" అన్నాను.

"కానీ ఓ విషయం. సాయంకాలం నారాయణగారు కలిశారు. ఆయనా వీరయ్యా మినీవేన్ తీసుకుని దక్షిణదేశ యాత్రలకు వెడుతున్నారు. మనల్నీ రమ్మనమన్నారు. నాకేం తెలుసు. నేను సరేననేసి, అడ్వాన్స్ కూడా ఇచ్చేశాను." సావిత్రి ఆత్రుతగా నా వైపు తిరిగినట్టుగా నా మీద ఓసారి చెయ్యివేసి, దాన్ని వెంటనే వెనక్కి తీసుకుంది.

"ఏఏ ఊళ్ళు వెడుతున్నారు?"

నేను నెమ్మదిగా అన్నాను... "పుణ్యక్షేత్రాలన్నీను. నువ్వు మీ తమ్ముడితో మద్రాసు వెడితే - నాకు వీలు కాదని వాళ్ళతో చెప్పేస్తాను. ఫామిలీస్‌తో వెళ్ళే వాళ్ళతో ఒక్కణ్ణీ వెడితే ఏం బావుంటుందీ?" అన్నాను.

సావిత్రి ఏం మాట్లాడలేదు.

"ఆలోచిస్తే చాలా ఆశ్చర్యంగా వుంటుంది సావిత్రీ. ఎన్నేళ్ళు నేనునిస్సారంగా జీవితాన్ని గడిపానా అని. ఉద్యోగం చేయడం, ఇంటిని మిమ్మల్ని పట్టించుకోవడం ఈ రెండే నా కర్తవ్యం అనుకున్నాను. నువ్వు పిల్లల్ని పెంచడం వాళ్ళని సాకడం నీ జీవిత లక్ష్యం

అనుకన్నావ్.. ఈ సంసార తాపత్రయం మనల్ని సుఖ, దుఃఖాల చుట్టూ ప్రదక్షిణాలు చేయడం నేర్పింది. తప్ప అసలైన శాంతీ, అసలైన ఆనందం అంటే ఏమిటో తెలియకుండా చేసింది. మనం మన పిల్లల్ని పెంచడానికి వృద్ధిలోకితేడానికి మనం ఈ దశలో వుండడానికీ, కారణం మన చాకచక్యమే అనుకున్నాం. మన వెనక ఛాయా మాత్రంగా వుంటూ వచ్చిన దైవాన్ని మనం గుర్తించలేకపోయాం!! ఇప్పుడు ఆ అవకాశం వచ్చింది. సృష్టిలో ప్రతీ చోటా తను ఉన్నానని చెప్పే భగవంతుడు చాలా గడుసువాడు సావిత్రీ... అలా పరోక్షంగా ఆయన ఉద్దేశం ఏమిటో తెలుసా? తను అన్నిటా అందరిలోనూ ఏ రూపంలో ఏ సంకేతంలో ఉంటున్నాడో మనల్ని తెలుసుకోమని!!'

సావిత్రి "అలానా" అంది ఆశ్చర్యంగా!!

"ఈ మధ్య నాకు నీ మీద కోపం వస్తోంది. ఇదీ అని చెప్పలేని తపన ఒకటి నాలో పుట్టింది.... అలాగే నీకూ నా మీద కోపం చిరాకూ వస్తున్నాయి. మనిద్దరం తీరిగ్గా కూర్చుని ఒకళ్ళనొకళ్ళం అపార్థం చేసుకోవడం మనిద్దరికీ మంచిది కాదు. మనిద్దరి మధ్యా ఓ మధ్యవర్తి వుంటే మంచిది. ఆ మధ్యవర్తి – కొడుకు,కూతురు, బావమరిది, బంధువూ కాకూడదు. ఆ మధ్యవర్తి ఆ పరమాత్మే కావాలి సావిత్రీ... నా గురించి ఆయనతో నువ్వేమయినా చెప్పు. అలాగే నేనూ ఆయనతో అన్నీ చెప్తాను. ఎందుకంటే ఆయన విశ్వబంధువు కాబట్టి..." అనేశాను.

"ఇవన్నీ మీరు ఎప్పుడు నేర్చుకున్నారండీ. ఈ విషయాలన్నీ మీకెలా తెలిశాయి?" సావిత్రి ప్రశ్నించింది నన్ను. నేను నవ్వేశాను.

"ఈ కబుర్లను ఈ మంచి మాటలను ఈ చల్లని మాటలను ఏమని పిలవాలి? వేదాంతమనేనా!" అని సావిత్రి మళ్ళీ అడిగింది.

నేను మళ్ళీ నవ్వేశాను.

"నేను రాఘవతో వెళ్ళను, వాడితో ఈ మాట చెప్పేస్తాను. మనం యాత్రలకు వెడదాం. మన ప్రయాణం ఖరారు చేయండి సరేనా?" అంది సావిత్రి నెమ్మదిగా.

"నిజమేనా, లేకపోతే మొహమాటానికి, నేను ఏమైనా అనుకుంటానని వస్తానంటున్నావా?" సంశయంగా అడిగాను నేను సావిత్రిని.

"నిజం – మీ మీద ఒట్టు"

"యాత్రలు చేయడం చాలా చాలా కష్టం. దారి పొడుగునా బోల్డు శ్రమపడాల్సి వస్తుంది. బాధలు అనుభవించాల్సి వస్తే తట్టుకోవాలి..."

"ఇవన్నీ నాకు తెలుసు.... నాకేదైనా ఇబ్బంది వస్తే నేను ఆ మహానుభావుడు, ఆప్తబంధువు, మధ్యవర్తి, అయిన భగవంతుడితో చెప్పుకుంటాను. మీతో ఏవీ చెప్పను. సరేనా?" అంది నవ్వుతూ సావిత్రి.

నేను నాలిక కరుచుకున్నాను. ఆ తర్వాత లోలోపలే నవ్వుకున్నాను. ❖